సాక్షి
మంచిర్యాల
గురువారం । 25 । జూలై । 2024



విద్యుత్‌తో తస్మాత్ జాగ్రత్త
వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని విద్యుత్ శాఖ డీఈ సూచనలు చేశారు. 8లో



మహిళా శక్తితో ఆర్థిక పురోభివృద్ధి
స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా 'మహిళా శక్తి'ని రూపొందించింది. 8లో

గరిష్టం/కనిష్టం
27.0 /25.0

వాతావరణం
ఉదయం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

పద్దుపై ఆశలు !



కోటపల్లి మండలం ప్రాణహిత నదీ తీరంలో నీట మునిగిన పత్తి చేను

- నేడు అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్
- కేంద్రం మొండి చేయి చూపినా.. రాష్ట్ర సర్కారుపైనే భారం
- గోదావరి కరకట్ట, పంటలకు వరదల నష్టం
- ఈ బడ్జెట్‌లోనైనా నిధులు ప్రకటిస్తే ప్రయోజనం



గతేడాది మంచిర్యాలలో ఇళ్లలోకి వరద నీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పూర్తి స్థాయి బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టనుంది. జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు నిధులు రావాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి పద్దుల కేటాయింపుపై ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రవేశ పెడుతున్న పూర్తిస్థాయి బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెంచుకున్నారు. జిల్లా పరిధిలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్(జన్నారం) నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం నిధులు ప్రకటిస్తే జిల్లా ప్రగతికి తోడ్పడనుంది.

సాగునీటికి గోస
తలాపునే గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నా జిల్లా పరిధిలో ఎక్కడా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు లేవు. మధ్యతరహా, చిన్న నీటి పారుదల వనరులతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన గోదావరిపై చెన్నూర్ ఎత్తిపోతలు, హాజీపూర్ మండల పరిధిలో పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం ముందుకు సాగడం లేదు. ఇవి కొనసాగిస్తారా? లేదా అనేది స్పష్టత రావడం లేదు. ప్రధాన ప్రాజెక్టులైన కడెం ఆయకట్టు, హాజీపూర్ మండలం ముల్కల్లలోని ర్యాలీవాగు, వేమనపల్లి మండలం నీల్వాయి, భీమారంలో గొల్లవాగు ప్రాజెక్టులు ఆధునికీకరించాల్సి ఉంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునఃప్రారంభించినా బెల్లంపల్లి వరకు ఉపయుక్తంగా ఉండనుంది. ఇక గోదావరి, ప్రాణహిత నదుల వరదలతో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో తీర ప్రాంత రైతుల పంటలు ఏటా నీటమునుగుతున్నాయి. వందల ఎకరాల్లో పంట నీట మునిగి నష్టపోతున్నారు. ఆ భూములను ముంపు ప్రాంతాలుగా గుర్తించి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

కరకట్టకు డిమాండ్లు
మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు వరద వచ్చి ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కరకట్ట నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. నదీ తీర ప్రాంత వరకు ఇళ్ల నిర్మాణాలు ఉండడంతో కరకట్ట కడితే వరద ఉధృతి తగ్గే అవకాశం ఉంది. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఆశలు నెలకొన్నాయి. సింగరేణి పరిధిలోనూ కార్మికుల సమస్యలు ఉన్నాయి. కొత్త గనుల ఏర్పాటు లేకపోగా, ఓపెన్ కాస్టుల ప్రభావంతో భూగర్భ గనులు తగ్గిపోయి ఉపాధిపై ప్రభావం చూపుతోంది.

పట్టణాలకు పైసలేవీ..
జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. అన్ని పట్టణాలు అభివృద్ధి నిధులు లేక కటకటమంటున్నాయి. మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, మందమర్రి, రామక్రిష్ణాపూర్, చెన్నూరు, బెల్లంపల్లి పట్టణాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. పట్టణ పౌరులకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న జనాభా అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, పౌర సేవలు అందించాల్సి ఉంది. సమీకృత మార్కెట్ల నిర్మాణం, తదితర మాస్టర్ ప్లాన్ అమలులో నిధుల కొరత నెలకొంది. పురపాలికల్లో కేవలం పన్నుల ఆదాయంతోనే సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.

మౌలిక వసతులకు నిధులు
విద్య, వైద్యంతోపాటు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాల్సి ఉంది. జిల్లాలో సర్కారు బడుల్లో వసతుల లేమితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మన ఊరు–మన బడి కింద పనులు నత్తనడకన సాగుతున్నాయి. చాలా చోట్ల పనులు పూర్తి కాలేదు. వైద్య పరిధిలో మాతాశిశు సంరక్షణ కేంద్రం గోదావరి ఒడ్డున ఉండడంతో ఏటా వానాకాలంలో వరదలకు ప్రభావితమవుతోంది. జిల్లా ఆసుపత్రిలోనూ సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉంది. పూర్తిస్థాయిలో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉంది. జిల్లా కేంద్రం నుంచి మండలాలు, గ్రామాలకు రోడ్లు పూర్తి చేయాల్సి ఉంది. గతంలో మంజూరైన పనులు నిధులేమితో నిలిచిపోయాయి. జిల్లాలో పర్యాటకం అవకాశం ఉన్నప్పటికీ సౌకర్యాలు లేక సరైన దిశలో ఉపయోగించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. ఇక ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ఆర్థిక ప్రోత్సాహం అందితే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మేలు కలుగనుంది.

న్యూస్‌రీల్

నిండుతున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ వరద నీటితో క్రమంగా నిండుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా బుధవారం వరకు 145.20 మీటర్లకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను 13.115 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కింద 9 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుండగా, అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ వేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో పిల్లలకు వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు, కీటకజనిత వ్యాధులు సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం 18 ప్రైవేటు ఆసుపత్రుల చిన్న పిల్లల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జ్వరం, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వివరాలు తెలియజేయాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కృపా, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్యులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో మొక్కలు నాటడం, సంరక్షణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని, మున్సిపాలిటీల వారీగా మొక్కలు నాటడంపై లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. ప్రతీ నర్సరీలో సుమారు 2 వేల వరకు వెదురు మొక్కలు పెంచాలని, వచ్చే సంవత్సరం అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దుల్లో నాటేందుకు దాదాపు 6 లక్షల వెదురు మొక్కలు సిద్ధం చేయాలని, మొక్కలు పెంచడంతో ఆదాయం సమకూరుతుందని అన్నారు. అటవీ భూములలో వెదురు, ఇతర మొక్కల పెంపకంపై అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, నర్సరీల్లో మొక్కలు పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మవిశ్వాసంతో అభివృద్ధి సాధించవచ్చు
కాసిపేట: అక్షరాస్యత ద్వారా ఆత్మవిశ్వాసంతో ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధించవచ్చని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా వయోజన విద్యాశాఖ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 100రోజుల్లో అక్షరాస్యులైన, కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఉమ్మడిజిల్లా కన్వీనర్ రెడ్డిమల్ల ప్రకాష్, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, బండ శాంకరీ పాల్గొన్నారు.

పాత'బడి' ఉరుస్తోంది..!

- పాఠశాలల్లో పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో విద్యార్థులు



చెన్నూర్: బేతాళవాడ పాఠశాల గదిలో పగుళ్లు



భీమారం: బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వర్షపు నీటి దార వద్ద కూర్చున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాతబడిన భవనాలు.. స్లాబ్‌లు లీకేజీ.. బీటలు వారిన గోడలు.. విరిగిన కిటికీలు.. ఇదీ జిల్లాలోని కొన్ని సర్కారు బడులు దుస్థితి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే ఆందోళన విద్యార్థులను వెంటాడుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా తరగతి గదులు దెబ్బతిని ఉరుస్తున్నాయి. ఏళ్లనాటి గదులు కావడంతో లీకేజీలతో నీరు చేరుతున్నాయి. మరోవైపు అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తి కావాలంటే మూడు నాలుగు నెలలు పట్టే అవకాశాలు లేకపోలేదు. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులు నిధుల్లేక అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో అసౌకర్యాల మధ్య విద్యార్థులు చదువులు సాగించాల్సి వస్తోంది. ఎడతెరిపి లేని వర్షాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉపాధ్యాయులూ ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 510, ప్రాథమికోన్నత 96, హైస్కూళ్లు 108 ఉన్నాయి. మొత్తంగా 724 పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు వందకు పైగా పాఠశాలల్లో వర్షాల కారణంగా సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ప్రహరీలు, మరుగుదొడ్లు ధ్వంసం కావడం, పాఠశాలల్లో నీరు నిలువడం వంటి సమస్యల కంటే ఎక్కువగా తరగతి గదుల్లో రూఫ్ లీకవుతున్నాయి. నాలుగైదు చోట్ల శిథిల భవనాలు ఉన్నట్లు తెలుస్తోంది.

నెర్రెలువారిన గోడలు.. విరిగిన కిటికీలు.
మంచిర్యాల హరిజనవాడ స్కూల్ భవనం నుంచి



భీమిని: చర్లపల్లిలో శిథిలావస్థలో పాఠశాల

బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి తరలించిన స్టేషన్‌రోడ్ స్కూల్‌లో సమస్యలు వెంటాడుతున్నాయి. పాఠశాల తరలింపు తర్వాత 10మంది లోపు నుంచి 61మందికి విద్యార్థుల సంఖ్య చేరింది. గదుల గోడలు నెర్రెలుబారి వర్షపు నీరు చేరుతోంది. విరిగిన కిటికీలతో నీరు లోపలికి వస్తుండగా.. బీటలు వారిన గోడలతో ఎప్పుడు ఎటు వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

గదుల్లో నీరు..
మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో 370మంది విద్యార్థులు ఉన్నారు. రెండో గదుల్లో స్లాబ్ నుంచి వర్షపు నీరు గదుల్లోకి చేరుతోంది. మన ఊరు–మన బడి కింద తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా గోడల నుంచి వర్షపు నీరు వస్తోంది. ఓ గదిలోని గ్రీన్ బోర్డుపై నీరు నిల్వ ఉండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించినా ఎంఈవో, భవిత, స్పోర్ట్ గేమ్స్, డీసీఈబీ, మరో పక్క నిర్మించిన గదుల్లో సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ కార్యాలయాలు తిష్టవేశాయి. ఎస్‌జీఎఫ్, స్పోర్ట్స్ కార్యాలయం ఇక్కడి నుంచి తరలినా సామగ్రి పేరిట ఇక్కడ కొనసాగుతున్నాయి. ఖాళీగా ఉన్న గదుల్లో స్టేషన్‌రోడ్ పాఠశాలకు, బాయ్స్‌స్కూల్‌కు కేటాయిస్తే కొంత సమస్య పరిష్కారం కానుంది.

- న్యూ గర్మిళ్ల పాఠశాలలో గోడలు నెర్రలుబారడంతో వర్షం నీరు కారుతోంది. పాఠశాలల గదుల్లో వెనుక వైపున విద్యార్థులు కూర్చోబెట్టకపోయిన ప్రమాదం జరిగితే ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

చెన్నూర్‌రోడ్ స్కూల్‌లో..
స్థానిక చెన్నూర్‌రోడ్ పాఠశాలలో విద్యార్థులున్నా గదుల కొరతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 114 మందికి పైగా ఉండగా ఇరుకైనా రెండు గదుల్లో చదువులు కొనసాగిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గదుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోని తేవాలని కోరుతున్నారు.

శిథిల భవనాల్లో పాఠాలు

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: చెన్నూర్ పట్టణంలోని బేతాళవాడ ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. భవనం శిథిలావస్థకురి గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో శిథిల భవనంలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఏడాది క్రితం మన ఊరు–మన బడిలో భాగంగా రూ.60లక్షలతో భవన నిర్మాణం ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 24మంది విద్యార్థులు ఉన్నారు. అందరినీ ఒకే భవనంలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.

తాండూర్/భీమిని: మండలంలోని బెజ్జాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కుంగిపోయి ఒక పక్క వంగి ప్రమాదకరంగా మారింది. కన్నెపల్లి మండలం జన్కాపూర్ పంచాయతీలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల భవనం స్లాబ్ కూలింది. మరుగుదొడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ఆ పాఠశాలను గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్నారు.



చెన్నూర్‌రూరల్: సోమనపల్లిలో ఒకే గదిలో



హాజీపూర్: ధర్మారం ప్రాథమిక పాఠశాల భవనం

భీమారం: మండలంలోని బూర్గుపల్లి, ధర్మారం ప్రభుత్వ పాఠశాలల్లో వర్షానికి భవనాలు ఉరుస్తున్నాయి. బూర్గుపల్లి పాఠశాలకు మన ఊరు–మన బడి కింద రూ.5లక్షలు మంజూరు కాగా ఇతర పనులు చేపట్టారు. భవనం స్లాబ్ నుంచి వర్షపు నీరు దారలా వస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. అదే గదిలో విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ధర్మారం ప్రాథమిక పాఠశాల గదిలోకి వర్షం వస్తే చాలు నీళ్లు వస్తున్నాయి.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ధర్మారం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాలకు గదులు తడిసిపోవడంతో ప్రమాదమని గుర్తించిన ఉపాధ్యాయులు పక్కనే ఉన్న మరో భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలో ప్రధానోపాధ్యాయుడి గది ఉరుస్తుంది.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు పక్క పాఠశాల గదుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. నిధులు మంజూరు కాక పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. పాఠశాల పైన నీరు నిలువడంతో గదుల్లో పైన తేమ వస్తూ ఉరుస్తోంది. పాఠశాలలో సుమారు 60 మంది విద్యార్థులు ఉంటారు.

7,497ఎకరాల్లో పంట నష్టం

- మూడు మండలాల్లో నీట మునిగిన పత్తి
- కొన్ని మండలాల్లోనే సర్వే



నెన్నెలలో వరదతో ఇసుక మేటలు వేసిన పత్తి పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ నెల 19, 20వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు 4,201మంది రైతులు 7,497 ఎకరాల్లో పంట నష్టపోయారు. కోటపల్లి మండలంలో 20గ్రామాలకు చెందిన 1,985మంది రైతులు 3,725 ఎకరాలు, భీమిని మండలంలో ఏడు గ్రామాలకు చెందిన 61మంది రైతులు 112 ఎకరాలు, వేమనపల్లి మండలంలో 15గ్రామాలకు చెందిన 2,155మంది రైతులు 3,660 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక సర్వేలో గుర్తించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో పత్తి పంట నీటమునిగి ఇసుక మేటలు వేసింది. రోజులకొద్దీ నీటిలో మురిగిపోయాయి. ప్రస్తుతం ప్రాణహిత, గోదావరి బ్యాక్‌వాటర్‌తో లోతట్టు ప్రాంతాల్లో పంట చేన్లు నీటిలో మునిగిపోతున్నాయి. అధికారులు ప్రాథమిక సర్వే పూర్తి స్థాయిలో చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కన్నెపల్లి, నెన్నెల, జైపూర్ మండలాల్లో భారీ వర్షాలు కురిసి నీట మునిగిన, ఇసుక మేటలు వేసిన పంట నష్టాన్ని గుర్తించలేదని వాపోతున్నారు.

ముసురు వర్షం..
బుధవారం జిల్లా వ్యాప్తంగా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురువగా 23 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో 28,1 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 24.1, లక్సెట్టిపేటలో 19.4, హాజీపూర్‌లో 14.6, కాసిపేటలో 23.4, తాండూర్‌లో 16.6, భీమినిలో 23, కన్నెపల్లిలో 34.2, వేమనపల్లిలో 34, నెన్నెలలో 31.7, బెల్లంపల్లిలో 23, మందమర్రిలో 23.1, మంచిర్యాలలో 16.6, నస్పూర్‌లో 17.8, జైపూర్‌లో 20.9, భీమారంలో 28.9, చెన్నూర్‌లో 26.9, కోటపల్లిలో 24.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 407.1 మిల్లీమీటర్లు కాగా 468.7 మిల్లిమీటర్లు కురిసింది. 15శాతం అధికం నమోదైంది. వేమనపల్లి 60శాతం అత్యధిక వర్షపాతం కురువగా, ఆరు మండలాల్లో 20 నుంచి 45శాతం అధికంగా నమోదైంది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది.

ఊపందుకుంటున్న వరినాట్లు..
భారీ వర్షాలతో జలాశయాల్లో వరద నీరు చేరడంతోపాటు నారుమళ్లలో నీరు నిలిచింది. దీంతో రైతులకు వరి సాగుపై భరోసా కలిగింది. ఇప్పటివరకు 1,76,861 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ఇందులో ప్రధానంగా పత్తి 1,47,949 ఎకరాల్లో విత్తుకున్నారు. వరి సాగు లక్ష్యం 1.60 లక్షల ఎకరాలు కాగా ప్రస్తుతం 2,819 ఎకరాల్లో నాట్లు వేసుకున్నారు. 1,13,530 ఎకరాలు నారు దశలో ఉంది. నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

పంట నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలి..



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్న. నాలుగు రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు నాలుగు ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరద కోతకు కాల్వలు పడి రెండు ఎకరాల వరకు మొలకలు కొట్టుకుపోయాయి. మరో రెండు ఎకరాల్లో ఇసుక మేటలు, మట్టి కప్పింది. నెల రోజుల పంట విత్తనం, కలుపు కూలి, ఎరువులు, కౌలు అంతర ఖర్చు రూ.60 నుంచి రూ.70 వేల వరకు నష్టం జరిగింది. కొన్ని మండలాల్లో సర్వే చేసింద్రు నెన్నెలలో జరిగిన నష్టాన్ని అధికారులు సర్వే చేసి గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.
– కొండు రమణ, నెన్నెల

13మంది ఎస్సైలు బదిలీ

మంచిర్యాలక్రైం: మల్టీ జోన్–1 పరిధిలోని కాళేశ్వరం, రామగుండంలో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఉత్తర్వులను అందజేశారు. బదిలీ అయిన వారిలో జిల్లాకు చెందిన వారు పలువురు ఉన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డీ.కిరణ్‌కుమార్	సీఎస్‌బీ రామగుండం	తాండూర్
సీహెచ్.కిరణ్‌కుమార్	తాండూర్	సీఎస్‌బీ రామగుండం
బీ.సౌజన్య	బెల్లంపల్లి 1 టౌన్	మాదారం
జీ.అనూష	మాదారం	వీఆర్ రామగుండం
కే.మహేందర్	రామకృష్ణపూర్ 1	బెల్లంపల్లి 2 టౌన్
డీ.రమేష్	బెల్లంపల్లి 2	వీఆర్ రామగుండం
సీహెచ్.రమేష్	తిర్యాణి	తాళ్లగురిజాల
జీ.నరేష్	తాళ్లగురిజాల	వీఆర్ రామగుండం

ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలి

బెల్లంపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. బుధవారం ఆర్డీవో హరికృష్ణకు ఫోన్ చేసి సూచనలు చేశారు. అసెంబ్లీ సమావేశాలు నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్నానని, నియోజకవర్గంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జన జీవితానికి విఘాతం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు.

సీఐఎస్‌ఎఫ్ క్యాంపులను సందర్శించిన ఐజీ



గోలేటి క్యాంపులో ఐజీ సర్వానన్

తాండూర్: సీఐఎస్‌ఎఫ్ ఐజీ సర్వానన్ బుధవారం సింగరేణి బెల్లంపల్లి ఏరియా గోలేటి, మాదారం సీఐఎస్‌ఎఫ్ క్యాంప్‌లను సందర్శించారు. క్యాంప్ పరిసరాలను పరిశీలించి అధికారులు, జవాన్లకు పలు సూచనలు చేశారు. గోలేటి 1ఏ మాగ్జిన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఆయన వెంట సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ యోగేష్ పర్మర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డీఎస్పీ పంతాటి సదయ్య, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం.. ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.8 గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్ మండల్ వద్ద బుధవారం గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. దిలీప్‌కుమార్ గంజాయి అమ్ముతున్నట్లుగా అందిన సమాచారం మేరకు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించగా, 200 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.6వేల ఉంటుందని తెలిపారు. సోదాల్లో ఎస్సై వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అడవి కుక్కల దాడిలో ఆరు మేకలు మృతి



మేక కళేబరం

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని శివగూడ అడవుల్లో బుధవారం సిడాం మానిక్‌రావుకు చెందిన ఆరు మేకలపై అడవి కుక్కలు దాడిచేసి హతమార్చాయి. ఉదయం మేతకోసం గ్రామ శివారులోకి వెళ్లిన మేకలపై అడవి కుక్కలు దాడి చేశాయి. మేకలు అరుపులు విని గ్రామస్తులు అడవిలోకి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాయి. వాటి పక్కనే మేస్తున్న ఆవుపై కూడా దాడి చేసి కుక్కలు గాయపర్చాయి. సుమారు రూ.75 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

బైక్ దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

మంచిర్యాలక్రైం: బైక్ దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కే.నిరోష బుధవారం తీర్పు వెల్లడించినట్లు స్థానిక కోర్టు లైసన్ అధికారి గులాం దస్తగిర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇల్లందుల రాజేశ్వర్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని 2021లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రాజేశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంచిర్యాల జిల్లా లింగాపూర్‌కు చెందిన సోయం స్వామి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన ఆత్రం ప్రశాంత్‌కుమార్‌లను దొంగలుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో సాక్ష్యధారాలు ప్రవేశపెట్టి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. రవీందర్ వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో ప్రశాంత్‌కుమార్, స్వామిలకు శిక్షవిధిస్తూ తీర్పు వచ్చింది.

నగల వ్యాపారిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తుకారం జువెల్లర్స్ షాపు యజమానులు వాసుదేవ్, నాందేవ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సిలాల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గద్దరాగడికి చెందిన అమ్జాద్ పాషా 7 నెలల క్రితం నగలు చేసివ్వాలని 15 తులాల బంగారాన్ని నాందేవ్, వాసుదేవ్‌లకు ఇచ్చాడు. పని ఒత్తిడి బాగా ఉన్నందున పని పూర్తి కాలేదని కాలయాపన చేస్తూ వచ్చిన వారు కొన్నిరోజుల నుంచి షాపును తెరువడం లేదు. కాగా వారిద్దరు పారిపోయారని తెలిసి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

'విద్యుత్'తో తస్మాత్ జాగ్రత్త!

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం
- ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి
- విద్యుత్‌శాఖ డీఈ రాజన్న



బెల్లంపల్లి: వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ డీఈ బి.రాజన్న పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తడి చేతులతో స్విచ్ బటన్ నొక్కడం, తెగిపోయిన కేబుల్ వైర్‌ను చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని ముట్టుకోవడం, ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లపై తడి బట్టలను ఆరేయడం వంటి చర్యలు ప్రాణాలమీదికి తెస్తాయని, అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు. విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలలని సూచిస్తున్నారు. విద్యుత్ సమాచారం ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో లేదా వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్‌పోల్‌ను ముట్టుకోవద్దు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కరెంట్ తీగల కింద నిలబడడం, నడవడం చేయకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టవద్దు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయాలి.
- విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను ముట్టుకోవద్దు. ఎక్కడైన చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటిపైకి ఎక్కి కరెంట్ తీగల సమీపానికి వెళ్లొద్దు. తీగలపై పడిన దుస్తులను కర్రలతో కానీ లోహంతో తయారు చేసిన రాడ్లతో కానీ తీయకూడదు.
- వర్షం పడుతున్న సమయంలో ఆరుబయట ఉన్న విద్యుత్ వైర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతులు చేయరాదు.

ఇళ్లల్లో..

- ఇంట్లో ఉన్న స్విచ్‌లను, ఇతరాత్ర కరెంట్ వస్తువులను పిల్లలు ముట్టుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను, వైర్లను ముట్టుకోవద్దు.
- ఇంట్లో ఉన్న వాటర్‌హీటర్, రైస్‌కుక్కర్, స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే ముట్టుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంటే డిష్ కనెక్షన్ తొలగించడం మంచిది.
- ఇంట్లో ఎక్కడైనా విద్యుత్‌వైరుకు ఇనుప వస్తువులు తగులుతున్నాయో చూడాలి. ఎక్కడైనా ఇనుప వస్తువుకు వైర్లు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి తొలగించే చర్యలు చేపట్టాలి.
- ఇంట్లోకి వచ్చే సర్వీసు వైర్ డ్యామేజ్ అయితే ఆలస్యం చేయకుండా సరి చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు కొత్త సర్వీసు వైర్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. అదేతీరుగా ప్రతీ కరెంట్ వస్తువుకు ఎర్త్ వైర్ బిగించుకోవడం శ్రేయస్కరం.

వ్యవసాయ భూముల వద్ద..

- వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు రోజువారీగా అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, వ్యవసాయ బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్‌ను తాకొద్దు.
- విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్‌లైన్ తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయవద్దు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయవద్దు.

అసలుకే మోసం !



మంచిర్యాల పట్టణంలో యాప్ బాధితులు

- రెట్టింపు డబ్బులంటూ 'యాప్'లో రూ.కోట్లు వసూళ్లు
- విత్‌డ్రా ఆప్షన్ ఎత్తివేయడంతో బాధితుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెట్టిన డబ్బులకు రెట్టింపు పొందవచ్చనే ఆశ అసలుకే మోసం తెచ్చింది. ఓ యాప్ సంస్థ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ప్రచారం చేసింది. రూ.కోట్లు వసూళ్లు చేసి తిరిగి డబ్బులు తీసుకునే అవకాశం లేకపోవడంతో బాధితులంతా లబోదిబోమంటున్నారు. దేశవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, సాంకేతికతను పెంపొందిస్తామని 'డేటామీర్' యాప్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రజలను ఆకర్షించింది. ఇందుకు తమ ప్రొడక్ట్స్ రోబోటిక్స్, ఏఐ, ఇంటెలిజెన్స్, డివిడెండ్లు, డేటా ప్రొడక్ట్స్, ఆయిల్ ఫ్యూచర్స్ ఇలా పలు రకాలుగా చెబుతూ కనీసం రూ.300నుంచి గరిష్టంగా రూ.2కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలంటూ ఆఫర్లు ఇచ్చింది. వీటిని కొనుగోలు చేస్తే పెట్టిన డబ్బులకు రోజువారీగా వడ్డీ చెల్లించడంతోపాటు బోనస్‌లు, అధిక మొత్తంలో పొందవచ్చని ప్రచారం చేశారు. ఇదంతా నమ్మి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, గృహిణులు వేలాది మంది డబ్బులు కట్టడం మొదలుపెట్టారు. గత వారంలో ఒక రోబోట్ కొంటే రెండు ఉచితమంటూ ఆఫర్‌లో, పెట్టిన డబ్బులకు సమంగా ఇస్తామని చెబితే ఒక్కొక్కరు రూ.లక్షల్లో కట్టారు. కొందరైతే చేతిలో డబ్బు లేకున్నా, బ్యాంకుల్లో లోన్లు, బంగారం కుదవ పెట్టి, అప్పులు తెచ్చి మరీ చెల్లించారు. ఒక్క మంచిర్యాల పట్టణంలో దాదాపు 800మంది వరకు రూ.2 కోట్లు, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో రూ.5కోట్ల వరకు చెల్లించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోనూ వేలాదిమంది బాధితులు ఉన్నారు. ఈ నెల 22నుంచి ఎవరికీ డబ్బులు విత్‌డ్రా కాకుండా ఆప్షన్ తీసేవారు. దీంతో యాప్ నిర్వాహకులకు ఫోన్లు, వాట్సాప్ చేసినా ఎలాంటి స్పందన రావడం లేదు. అంతేకాక పెట్టిన డబ్బులు యూపీ, బెంగాల్‌కు చెందిన వేర్వేరే కంపెనీల పేర్లతోనూ ఉన్నాయి. దీంతో బాధితులు తమను చేర్పించిన వారి ఇంటి ముందుకు వెళ్లి గొడవ చేస్తున్నారు. చివరకు మంచిర్యాల పరిధిలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. బుధవారం సాయంత్రం నుంచి యాప్ నిర్వాహకుల నుంచి పెట్టుబడిదారుల అకౌంట్లు యాక్టివేట్ కావాలంటే మళ్లీ రూ.300నుంచి రూ.26,888 వరకు చెల్లిస్తే గురువారం వరకు యథావిధిగా సాగుతుందని మేసేజ్‌లు వస్తున్నాయి. గత మూడు రోజులుగా స్పందించకుండా మళ్లీ ఇలా మేసేజ్ రావడంపై ఎవరికి నమ్మకం లేక బాధితులు అందరూ ఏకమై వాట్సాప్ గ్రూప్ వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా డబ్బులు పెట్టిన వారంతా పోరాటానికి సిద్ధమయ్యారు. మరోవైపు 'కొంపముంచిన 'రెట్టింపు' ఆశ!' అనే శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనంతో ఈ యాప్ నిర్వాహకం వెలుగులోకి వస్తోంది.

వర్క్‌షాపులో సమస్యలు పరిష్కరించాలి



డీవైజీఎంతో మాట్లాడుతున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని వర్క్‌షాపులో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఏరియా వర్క్‌షాపును సందర్శించిన సత్యనారాయణకు వర్క్‌షాపు ఉద్యోగులు సమస్యలు తెలిపారు. అనంతరం వర్క్‌షాపు డీవైజీఎం నాగరాజ్ నాయక్‌తో మిషన్‌షాప్ ఉద్యోగులకు ప్లేడేల పరిధి పెంచాలని, స్వీపర్లను వెంటనే నియమించాలని, గ్యారేజీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వాష్‌రూం పరిశుభ్రంగా ఉంచాలని తదితర సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు. ఆయన వెంట యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

తాండూర్(బెల్లంపల్లి): రెండు లారీలు ఢీకొనగా ఓ లారీ డ్రైవర్ దుర్మరణం పాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు కోళ్ల దానాతో వెళ్తున్న లారీని, చంద్రాపూర్ నుంచి హైదరాబాద్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ మండల కేంద్రంలోని ఫ్లెక్టీవర్ వద్ద వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో బొగ్గు లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న సిద్దిపేటకు చెందిన డ్రైవర్ ఎండీ అన్వర్(42) ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి బుధవారం తెల్లవారుజామున అన్వర్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలి



నియామకపత్రాలు అందజేస్తున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారు క్రమశిక్షణతో పనిచేయాలని సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయం వద్ద పలువురికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థల్లో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత కంపెనీ అప్పగించే ప్రతీ పనిని చేయాలన్నారు. రక్షణతో పనిచేస్తూ కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటివరకు 3430 మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజిసైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, ఫిట్ సెక్రటరీ రామచందర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా కమిటీ ఎన్నిక



సిద్ధయ్య



శ్రీకాంత్‌రెడ్డి

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం మంచిర్యాల పట్టణంలో జరిగింది. ఎన్నికల పర్యవేక్షణాధికారులు కేశవరెడ్డి, యాదగిరిశేఖర్‌రావు, అదినాథ్‌లు నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా చంద్రమోహన్‌గౌడ్ లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

కాళేశ్వరంజోన్‌లో సాంఘిక సంక్షేమ గురుకులాలు



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణాకుమారి

మంచిర్యాల అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిపాలన నిర్ణయాల్లో భాగంగా రీజినల్ కో-ఆర్డినేటర్ కార్యాలయాలను జోనల్ కార్యాలయాలుగా మార్చారు. కాళేశ్వరం జోన్‌లో ఆసిఫాబాద్ కుమరంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాల్‌పల్లి, ములుగు జిల్లాల్లోని గురుకుల పాఠశాలలను చేర్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆదిలాబాద్ రీజినల్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి స్థానంలో కాళేశ్వరం జోనల్ అధికారిగా శ్రీ అరుణాకుమారి నియమితులయ్యారు. బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల రీజినల్ (జోనల్) కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. స్వరుపారాణి ఖమ్మం జోనల్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు.

ఇనుప సామగ్రి దొంగ అరెస్ట్



దొంగ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: ఇంటి కిటికీలకు వినియోగించే ఇనుప ఫ్రేమ్‌లను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ బన్సిలాల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక హైటెక్ సిటీ కాలనీకి చెందిన రాముల ప్రతాప్‌రెడ్డి తన ఇంటి నిర్మాణం కోసం చేయించిన 30 ఇనుప కిటికీ ఫ్రేమ్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ప్రతాప్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేశారు. మంచిర్యాల వడ్డెర కాలనీకి చెందిన శాతరాజి రాజేశ్‌తో పాటు మరో ముగ్గురు మైనర్ బాలురు దొంగతనం చేసినట్లు గుర్తించారు. 30 ఇనుప ఫ్రేమ్‌ల్లో 9 ఫ్రేమ్‌లను అమ్ముకోగా, మిగిలిన వాటిని విక్రయించేందుకు ఆటోలో తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్సై సురేశ్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. రాజేశ్ వద్ద నుంచి ఆటో, 21 కిటికీ ఫ్రేమ్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'మహిళాశక్తి'తో ఆర్థిక పురోభివృద్ధి

- నారీమణులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సాహం
- ఎంచుకున్న యూనిట్‌లపై శిక్షణ
- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

జిల్లాలో ఏర్పాటు చేసే యూనిట్‌లు..

పాడి పశువుల పెంపకం	500
కోడిపిల్లల పెంపకం	2000
కోళ్లఫారాలు (దేశవాలీ రకాలు)	16
రిటైల్ అవుట్‌లెట్ మొబైల్‌ఫిష్ మార్కెటింగ్	01
మిల్క్‌పార్లర్	01
మైక్రోఎంటర్‌ప్రైజెస్	5684
మీసేవ కేంద్రాలు	20
మహిళాశక్తి క్యాంటీన్‌లు	05
చెత్త శుద్దీకరణ యూనిట్‌లు	01
ఆహార ఉత్పత్తి యూనిట్‌లు	200



అవగాహన కల్పిస్తున్న డీఆర్డీవో కిషన్

పాతమంచిర్యాల: స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళలను ఐదేళ్లలో లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ వారు ఎంచుకున్న రంగాలలో అభివృద్ధి సాధించడానికి చేయూతనిస్తుంది. జిల్లాలో మహిళాశక్తి కార్యక్రమం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.81 కోట్ల బ్యాంకు రుణాలు అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు నిర్ణయించారు. ఈ నిధులతో పాడిపశువుల పెంపకం, కోడిపిల్లల పెంపకం, దేశవాలీ రకాల కోళ్ల పెంపకం, చేపల వ్యాపారం, మీ సేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు, ట్రేడింగ్, ప్రొడక్షన్, సర్వీసింగ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లు, చెత్త శుద్దీకరణ యూనిట్‌లు, ఆహార ఉత్పత్తి యూనిట్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లు నెలకొల్పడానికి ప్రణాళికలు తయారు చేశారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా శక్తి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. జులై నెలాఖరు వరకు మహిళా సంఘాలలోని లబ్ధిదారులను ఎంపిక చేసి వారు ఎంచుకున్న యూనిట్‌లపై శిక్షణ, అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం అధికారులు ఎంపిక ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. ఆయా యూనిట్‌లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ స్వయం సహాయక సంఘాల ద్వారానే జరుగుతుందని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు స్పష్టం చేశారు.

- **పాడిపశువుల పెంపకం యూనిట్‌లు:** జిల్లాలో 500 పాడిపశువుల పెంపకం యూనిట్‌లు స్థాపించాలని అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.90 వేలు బ్యాంకు రుణం అందించనున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పించనున్నారు.
- **చిన్న కోడిపిల్లల పెంపకం:** ఈ పథకంలో భాగంగా ఒక్కో యూనిట్‌కు 30 -50 కోడి పిల్లలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. యూనిట్ విలువ రూ.15 వేలు
- **కోళ్లఫారం:** యూనిట్ విలువ రూ.29100. దేశవాలీ బ్రీడ్‌కోళ్లు, కడక్‌నాథ్, గిరిరాజ, వనరాజ కోళ్ల పెంపకం చేపట్టాలి.
- **మిల్క్‌పార్లర్:** జిల్లాకు ఒక యూనిట్ కేటాయించారు. యూనిట్ విలువ రూ.1.90లక్షలు
- **మైక్రోఎంటర్ ప్రైజెస్:** ప్రతీ గ్రామంలో 5 నుంచి 10 యూనిట్‌లు పెట్టుకోవచ్చు. దీనిలో బట్టల షాపులు, కంగన్‌హాల్‌లు, మసాలా దినుసుల తయారీ, తినుబండారాల తయారీ, బార్బర్ షాపులు, బ్యూటీపార్లర్‌ల ఏర్పాటు చేసుకోవచ్చు.
- **మీసేవ కేంద్రాలు:** 20 యూనిట్‌లను మహిళా సంఘాల సభ్యులు లేదా వారి కుటుంబసభ్యులలో అర్హులకు కేటాయిస్తారు.
- **మహిళా శక్తి క్యాంటీన్‌లు:** 5 యూనిట్‌లను జిల్లా కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రద్దీ ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- **ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్:** జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయనున్నారు. దీనిలో 20 నుంచి 40 సభ్యులకు వేడుకల నిర్వహణపై శిక్షణ కల్పించనున్నారు.
- **చెత్త శుద్దీకరణ యూనిట్:** జిల్లాలో ఒక యూనిట్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసి తడి,పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువులు తయారు చేయనున్నారు.
- **ఆహార పదార్థాల తయారీ యూనిట్‌లు:** 200 యూనిట్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యం



మహిళా సంఘాల సభ్యులను లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. మహిళలు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి, అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ



డీఎం జనార్దన్‌ను సత్కరిస్తున్న రవీంద్రనాథ్, ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: డ్రైవర్ల స్వీయ నియంత్రణతోనే ప్రమాదాలు నియంత్రించవచ్చని ఎస్సై సనత్‌రెడ్డి అన్నారు. బుధవారం మంచిర్యాల డిపో గ్యారేజ్‌లో ప్రమాద రహిత వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో వేగ నియంత్రణ చాలా ముఖ్యమని, మూలమలుపుల వద్ద ఓవర్ టేకింగ్ చేయవద్దని డ్రైవర్లకు సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌తోపాటు బదిలీపై వచ్చిన డీఎం జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల పాల్గొన్నారు. కాగా, కరీంనగర్ నుంచి మంచిర్యాల డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చిన జనార్దన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు విధులు నిర్వర్తించిన డీఎం రవీంద్రనాథ్ హుజూరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రవీంద్రనాథ్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, ఎంఎఫ్ సుధాకర్, స్టోర్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గొంతు నులిమి మహిళ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

కాసిపేట: తన లైంగిక వాంఛ తీర్చలేదని మహిళను గొంతు నులిమి హత్య చేసిన సంఘటన కాసిపేట మండలం లంబాడితండా(డి)లో చోటు చేసుకుంది. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం అజ్మీర నీల(44) అనే మహిళ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. 15ఏళ్ల క్రితం భర్త చనిపోగా పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తూ లంబాడితండాలో నివాసం ఉంటుంది. రవి స్నేహితుడు కుడిమేత అంబారావు నీలను సహజీవనం చేయాలని తరుచూ వేధించేవాడు. బుధవారం మధ్యాహ్నం అంబారావు నీలను లైంగికవాంఛ తీర్చాలని వేధింపులకు గురి చేయగా ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ దేవాపూర్ పోలీస్‌స్టేషన్ చేరుకొని కేసు వివరాలు తెలుసుకున్నారు. నీల అన్న దేవిసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

దండేపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్టీయూటీఎస్‌తోనే పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో బుధవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన త్వరలో సాధ్యమవుతుందని చెప్పారు. ఎస్జీటీలను రిలీవ్ చేయించేందుకు ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావెన వేని రవి, మల్యాల మల్లేష్ సభ్యులు కొండు జనార్దన్, అప్పాల మనోహర్, పాత రమేష్, వరలక్ష్మి రమేష్ పాల్గొన్నారు.